క్లుప్తంగా

ప్రత్యేక రుణాలు ఇవ్వాలి



ఏటూరునాగారం: ఎలక్ట్రీషన్ కార్మికులకు ప్రత్యేక రుణాలు ఇవ్వాలని తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రీషన్ టెక్నీషియన్ ఫెడరేషన్ మండల అధ్యక్షుడు గండెపల్లి సత్యనారాయణ అన్నారు. జనవరి 27వ థామస్స్ అల్వాఎడ్సిన్ బల్బును కనిపెట్టిన సందర్భంగా శనివారం ఎలక్ట్రీషన్ డే నిర్వహించారు. మండల కేంద్రంలో ఎలక్ట్రీషియన్ ఫెడరేషన్ సభ్యులు వారి ఫెడరేషన్ జెండాను ఎగురవేశారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ.. ప్రైవేటు కార్మికులకు బ్యాంకుల నుంచి వడ్డీ లేని రుణాలు ఇచ్చి ఆదుకోవాలన్నారు. షాపుల ఏర్పాటు ప్రభుత్వం సహాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాసర్ల నారాయణ, దుర్గం దుర్గారావు, జాడి సమ్మయ్య, కూర్కు సాంబయ్య, కోడం కిరణ్, ఇర్సవడ్ల నాగరాజు, కుమార్, ప్రవీణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

సబ్ సెంటర్ పరిశీలన



మల్హర్: మండలంలోని అన్సాన్‌పల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సబ్ సెంటర్‌ను కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశాల మేరకు మండల ప్రత్యేకాధికారి అవినాష్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి రికార్డులను తనిఖీ చేశారు. సబ్‌సెంటర్‌లో మౌలిక వసతులపై ఆరా తీసి, మందుల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసున్నారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బహుమతుల అందజేత



కాళేశ్వరం: మహదేవపూర్ మండలం కాళేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. కాగా గెలుపొందిన విద్యార్థులకు బందెల రాజేశ్వరి జ్ఞాపకార్థం కుమారుడు బందెల వెంకటేష్ ఎంపీటీసీ రేవెల్లి మమత–నాగరాజుల ఆధ్వర్యంలో శనివారం బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం అంజలీదేవి, తదితరులు ఉన్నారు.

తనిఖీ



మహాముత్తారం: మండలంలోని ములుగుపల్లిలోని 1,2, దుంపిల్లపల్లె, బొగ్గులపల్లె అంగన్‌వాడీ కేంద్రాలను, పాఠశాలలను, పంచాయతీ కార్యాలయాన్ని ఎంపీడీఓ పెద్ది ఆంజనేయులు శనివారం తనిఖీ చేశారు. బొగ్గులపల్లెలోని కిచెన్ గార్డెన్ చూశారు. ఆయన వెంట సర్పంచ్ దూలం మల్లయ్య గౌడ్, కార్యదర్శి పాగే లక్ష్మీ ఉన్నారు.

పోటీ పరీక్షలకు హాజరు కావాలి



ఏటూరునాగారం: ప్రశ్నపత్రాలను ఆవిష్కరిస్తున్న హెచ్ఎం సాంబశివరావు



ములుగు రూరల్: విద్యార్థికి బహుమతి అందిస్తున్న ఎంఈఓ శ్రీనివాసులు

ఏటూరునాగారం: విద్యార్థులు పోటీ పరీక్షలకు తరుచు హాజరు కావాలని, దాంతో మనలోని ప్రతిభ బయటకు వస్తుందని జెడ్పీహెచ్‌ఎస్ హెడ్మాస్టర్ సాంబశివరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు ప్రశ్న పత్రాలను హెడ్మాస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఈ పోటీలకు 8, 9, 10వ తరగతి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పరీక్షలో ఆగ్లమాధ్యమంలో ఏటూరునాగారం జెడ్పీహెచ్‌ఎస్‌కు మొదటి బహుమతి, తెలుగు మాధ్యమంలో ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు మొదటి బహుమతి గెలుచుకున్నారన్నారు. గెలుపొందిన విద్యార్థులు ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహించే చెకుముకి పోటీలో విజయం సాధించి మండలానికి గుర్తింపు తేవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక మండల కన్వీనర్ టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్షుడు పత్రి కిరణ్, శిందె రాజేష్, భూమిరెడ్డి శ్రవణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహుమతుల అందజేత

ములుగు రూరల్: జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీల్లో రాయినిగూడెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు శనివారం మొదటి బహుమతి సాధించిన జబ్బ స్వర్ణజిత్, ద్వితీయ బహుమతి బీరబోయిన గణేష్, తృతీయ బహుమతి వజ్జ అరుణ్ లు సాధించగా ఎంఈఓ బహుమతులను అందించారు. ఆశ్రమ పాఠశాల ప్రిన్సిపాల్ నాగేశ్వర్‌రావు, ప్రతాప్‌సింగ్, దేవేందర్ పాల్గొన్నారు.

ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి



మాట్లాడుతున్న హెచ్ఎం భాస్కర్‌రావు

మంగపేట: కల్తీ ఆహారానికి దూరంగా ఉండి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హెచ్ఎం రావుల భాస్కర్‌రావు అన్నారు. మండలంలోని రాజుపేట జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఆహారం కల్తీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో ప్రతి నాలుగో శనివారం నిర్వహించే నోబ్యాగ్‌డే కార్యక్రమంలో భాగంగా ఆహారపు కల్తీ, జీవన నైపుణ్యాలలో విజయం సాధించిన వ్యక్తులు, అపజయాలను ఎదుర్కొన్న వ్యక్తుల జీవిత గాదలు, డిజిటల్ నైపుణ్యాలపై క్విజ్ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. హోటళ్లు, రెస్టారెంట్లు, వీధుల్లో అమ్మే ప్లాస్టిక్ కవర్లలో అజిటోమోనాట్, మోనోసోడియం గ్లూటానోట్ వంటి హానికరమైన లవణాలను కలిపి నిల్వ ఉంచిన ఆహారం తినడం వలన చిన్న వయసులోనే బీపీ, షుగర్, కిడ్నీ జబ్బులు, కండరాల బలహీనత ఏర్పడుతుందని వివరించారు. ఆహార పదార్థాల రుచి కోసం వాడే ఈ టేస్టు సాల్ట్‌ను కొన్ని దేశాలు నిషేధించిన మనదేశంలో ఇంకా వినియోగిస్తూనే ఉన్నారన్నారు. ఇటువంటి రసాయన పూరిత లవణాలు వాడటం వలన కేన్సర్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. దీనికి ప్రత్యామ్నయంగా గానుగ నూనెలు వాడాలని అన్ని నూనెలు మంచివే అయినప్పటికీ అతిగా వాడరాదన్నారు. అతిగా నూనెలను వాడటం, ఒకే రకమైన నూనెను వాడటం వలన ప్రమాదకరమైన జబ్బులు వస్తాయన్నారు. ప్రస్తుత మార్కెట్‌లో ఉన్న అనేక రకాల ఆహార పదార్థాలు కల్తీవేనని పాల పాకెట్ నుంచి పసుపు, కారం, నెయ్యి, నూనె వరకు కల్తీవేనని వీటిని గుర్తించేందుకు సులబమైన టెక్నిక్‌లను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు జమున, రాజ్యలక్ష్మి, పద్మ, లావణ్య, సుజాత, ప్రమీల, భానోతు బాలాజీ,లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూసిన రోడ్డును తెరిపించాలి



మూసి ఉన్న రోడ్డును చూపిస్తున్న నాయకులు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని ప్రధాన జాతీయ రహదారి 163ను గత 23 సంవత్సరాల క్రితం నక్సల్స్ ప్రభావితం ఎక్కువగా ఉందని మూసి వేశారని ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోని తెరిపించాలని బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ)ములుగు అసెంబ్లీ ఇన్‌చార్జ్ గడ్డం భిక్షపతి గౌడ్ అధికారులను కోరారు. శనివారం మండల కేంద్రంలోని రోడ్డు బ్లాక్ చేసిన ప్రాంతాన్ని నాయకులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2001 నుంచి ప్రస్తుత నేటి రోజు వరకు అది అలాగే ఉందని, జాతీయ రహదారి మూసివేయడం వల్ల ఐటీడీఏ పీఓ గెస్ట్ హౌస్ చుట్టూ తిరిగి వెళ్లాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. భారీ వాహనాలు కంటైనర్ వెళ్లాలంటే ఇరుక్కుపోయి గంటల తరబడి సమయం పడుతుందని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర మంత్రి సీతక్క, ప్రభుత్వ ఉన్నత అధికారులు స్పందించి వెంటనే జాతీయ రహదారి 163 పోలీస్ స్టేషన్ ముందు ఉన్న భారికెడ్లు చెక్ పోస్ట్ ద్వారములు తీసివేసి ఐటీడీఏ పీఓ గెస్ట్ హౌస్ చుట్టూ కాకుండా డైరెక్ట్ గా వాహనాలు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) జిల్లా మహిళా కన్వీనర్ గుంటపూడి తిరుమలక్క, అసెంబ్లీ అధ్యక్షుడు ఏంపల్లీ వీరాస్వామి, మండల అధ్యక్షుడు ఏంపల్లి రాజు, మంగపేట మండల అద్యక్షులు మురళి గౌడ్ పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి



రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్

ఏటూరునాగారం: మండలంలోని ఎరువులు, ఫర్టిలైజర్, విత్తన యజమానులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం రికార్డులను మెంటనెన్స్ చేయాలని తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని అగ్రోస్ సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపులోని రికార్డులు, నిలవ్వలను తనిఖీ చేశారు. పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఏఓ వేణుగోపాల్, ఏఈఓ రాజు ఉన్నారు.

గ్రంథాలయంలో సదుపాయాలు కల్పించాలి



సిబ్బందికి వినతిపత్రం అందిస్తున్న జంపన్ననాయక్

ములుగు: జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీఎస్పీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జీ భూక్య జంపన్న నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పాఠకులు, స్థానిక విద్యార్థులతో కలిసి శనివారం గ్రంథాలయ సిబ్బందికి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జంపన్న మాట్లాడుతూ.. పోటీ పరీక్షలు కోసం రోజువారిగా వందలాదిమంది గ్రంథాలయానికి వస్తున్నారని అన్నారు. ఆవరణలో చెత్తాచెదారం ఇతర వ్యర్థాలు పేరుకపోయి ఉండడంతో పాఠకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. జిల్లా కేంద్రంలో గ్రంథాలయానికి మరికొంత స్థలాన్ని కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేవేందర్, రఘు, మల్లికార్జున్, మమత, మహేశ్, అరుణ్‌కుమార్, రాజు, సందీప్, కవిత తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న సీడీపీఓ అవంతి

చిట్యాల: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ అవంతి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని నాలుగవ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ జయప్రద ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు, పిల్లలకు అక్ష్యరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీఓ అవంతి హాజరై మాట్లాడుతూ.. గర్భిణులు రోజుకు ఎక్కువ మోతాదులో పీచుతో కూడిన కూరగాయాలతో ఆహారం తీసుకోవాలని, నీరు ఎక్కువగా తాగాలని కోరారు. క్రమం తప్పకుండా ఐరన్, కాల్షియం మాత్రలు వేసుకోవాలని అన్నారు. 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని అన్నారు. ఇక్కడ ఆటలతో కూడిన విద్యను అందించడం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీ దబ్బెట అనిల్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రఘుపతి, నీలిమా, అంగన్‌వాడీ టీచర్ భాగ్యలక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



ములుగు రూరల్: నివాళులర్పిస్తున్న రాజేందర్



టేకుమట్లలో..

ములుగు రూరల్: మండలంలోని శ్రీనగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుత్తురు రాజు తండ్రి మల్లయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్‌గౌడ్ పరామర్శించారు. మల్లయ్య మృత దేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, ఎస్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు మామిడిశెట్టి కోటి, శ్రీనివాస్, లచ్చిరామ్, ఆనంద్, రమేష్, యాకయ్య, దేశ్య తదితరులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామానికి చెందిన అడగాని కిషన్‌రావు, చెక్క శ్రీకాంత్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శనివారం వారి కుటుంబ సభ్యులను చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ కొడారి రమేష్, ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి పరామర్శించారు. స్థానిక సర్పంచ్ అడగాని రామారావు, కట్కూరి నరేందర్, నిమ్మల సారయ్య, పాలాల సరోత్తంరెడ్డి, నందికొండ మహిపాల్‌రెడ్డి, పండుగ శ్రీను, నిమ్మల స్వామి, ఉద్దమారి మహేష్‌యాదవ్, ఆకునూరి తిరుపతి, బొల్లు సరోత్తం రెడ్డి, ఆది రఘు, వేణు, పైడి, తదితరులు ఉన్నారు.

రోడ్డుపై మురుగు



కాల్వను పరిశీలిస్తున్న బీఎస్పీ నాయకులు

మహాముత్తారం: యామన్‌పల్లిలోని ప్రధాన రహదారి వెంట మురికి నీరు ప్రవహిస్తున్న స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదని బీఎస్పీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జ్ అట్టెం రమేష్ ముదిరాజ్ ఆరోపించారు. శనివారం ఆయన యామన్‌పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామ ప్రధాన రహదారుల వెంబడి ప్రవహిస్తున్న మురికి నీటిని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రద్దీగా ఉండే ఈ రహదారి వెంబడి మురుగు ఉండటంతో స్థానికులు, చిరువ్యాపారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి సైడ్ కాల్వలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రామిల్ల రాకేష్, రాజ్‌కుమార్, లింమూర్తి తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ సేవలను వినియోగించుకోవాలి



ఆట వస్తువులను అందజేస్తున్న ఎంపీడీఓ

చిట్యాల: మండలంలోని గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు అంగన్‌వాడీ కేంద్రంలో అందించే సేవలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ రామయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలోని ఒకటోవ అంగన్‌వాడీ కేంద్రానికి కలెక్టర్ చొరవతో పంపించిన టీవి, ఆట వస్తువులను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలను ఆధునీకరించి పిల్లలకు, తల్లులకు మరింత అందుబాటులోకి తీసుకరాడానికి కలెక్టర్ భవేష్‌మిశ్రా ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని తెలిపారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు సమతుల్యమైన పౌష్టిక ఆహారం అందిస్తూనే వారి విజ్ఞానాన్ని పెంపొందించుకోవడానికి అవసరమైన ఆట వస్తువులు సమకూర్చడం జరిగిందని పేర్కొన్నారు. టీవిలో ప్రసారమయ్యే పిల్లల కార్యక్రమాలను చూపిస్తూ వారిలో సృజనాత్మకను, మానసికోల్లాసం పెంపోందిస్తూ ఆటపాటల విద్యను అందించి పిల్లలకు చదువుపై మక్కువ పెరిగేలా కార్యక్రమాలు అందించేందుకు కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, పీఆర్ఏఈ తిరుపతి, పంచాయతీ కార్యరద్శి రవి కుమార్, అంగన్‌వాడీ టీచర్ చింతల సంధ్యారాణి, ఆయా లావణ్య పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఏఎస్సై రవీందర్ రెడ్డి

రేగొండ: సైబర్ నేరాలపై విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని ఏఎస్సై రవీందర్ రెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ.. ఫోన్లలో ఆన్‌లైన్ గేమ్స్ ఆడోద్దన్నారు. సెల్‌ఫోన్లు, టీవీలకు బానిస కావొద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల కోసం పడుతున్న శ్రమను గుర్తించి ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలన్నారు. సైబర్ నేరాలకు గురైనప్పుడు 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కిరణ్‌సింగ్, హోంగార్డు శ్రీశైలం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న కీర్తిరెడ్డి

చిట్యాల: క్రీడల్లో గెలుపోటములు సహజం అని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి పాఠశాల, కళాశాల క్రీడల్లో గెలుపోందిన క్రీడాకారులకు శనివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా కీర్తిరెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంత పేద పిల్లలు జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో ప్రతిభను చూపిస్తున్నారని అన్నారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో యువజన ఉత్సవాలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు మంత్రి హర్షవర్ధన్, ఆర్‌ఎస్ఎస్ జిల్లా కార్యవర్గ సభ్యులు బుర్ర సదయ్య, శ్యామాల్, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భిక్షపతి, నాయకులు లక్ష్మారెడ్డి, ఉపాధ్యాయులు రాకేష్, పీఈటీలు భాస్కర్, ఆనంద్, సమ్మయ్య, కార్తీక్, శ్రీనివాస్, వెన్నెల స్పందన, శ్రావణి, రజిత, అజయ్ ఉన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న రాజబాబు, ఉపాధ్యాయులు

కాటారం: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు పోస్టర్‌ను శనివారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షుడు గండు రాజబాబు మాట్లాడుతూ.. ఫిబ్రవరి 11, 12న ఖమ్మంలో వైజ్ఞానిక మహాసభలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఉమారాణి, ఉపాధ్యాయులు సమ్మయ్య, వెంకట్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

జరిమానా

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని జంపన్న వాగు నుంచి ఇసుకను డీడీలు లేకుండా తరలిస్తున్న నాలుగు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని యజమానులకు జరిమానా విధించినట్లు తహసీల్దార్ ఖాజామొహినొద్దీన్ తెలిపారు. తహసీల్దార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రం సమీపంలోని జంపన్న వాగు నుంచి శనివారం ఒక డీడీ ఒక ట్రిప్పు తరలించగా, మరోక ట్రిప్పును ఎలాంటి డీడీ లేకుండా తరలిస్తుండగా నాలుగు ట్రాక్టర్లను పట్టుకొని తహసీల్దార్ కార్యాలయానికి తరలించామన్నారు. హెచ్చరించి ఒక్కో ట్రాక్టర్‌కు రూ. 2వేల చొప్పున నాలుగు ట్రాక్టర్లకు జరిమానా విధించామన్నారు.

మట్టి రోడ్డు పనులు ప్రారంభం

- చలివాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మాణం
- ప్రయాణికులకు తగ్గనున్న దూర భారం



చలివాగులో నిర్మిస్తున్న రోడ్డు

టేకుమట్ల: వర్ష కాలంలో వరదలకు టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగుపై వంతెన కూలిపోడంతో టేకుమట్లకు వాగవతలి గ్రామాలకు రవాణా స్తంభించింది. దీంతో మూడు నెలల అనంతరం మండల ప్రజల కోరిక మేరకు గత ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ద్విచక్ర వాహనాలతో పాటు, పాదాచారుల కోసం వంతెనపై తాత్కాలిక వంతెనను ఏర్పాటు చేయడంతో రవాణా మెరుగైంది. కేవలం ద్విచక్ర వాహనాలు, కాలినడకకే వంతెన అనుకూలంగా ఉండడంతో ఆటో, టాటాఏస్, బస్ వంటి భారీ వాహనాల రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొంత మంది ప్రయాణికులు ద్విచక్ర వాహనాలపై, మరికొంత మంది కాలి నడకన టేకుమట్ల–రాఘవరెడ్డిపేట మధ్య ప్రయాణిస్తున్నారు. వంతెన పునర్మిణానికి ప్రభుత్వం నిధులు కేటాయించినా భారీ నీటి నిల్వతో వంతెన నిర్మాణ పనులకు కాస్త ఆటంకం కలుగడంతో ఫిబ్రవరిలో జరిగే మేడారం శ్రీసమ్మక్క–సారలమ్మ జాతరకు నిత్యం వేలాది మంది భక్తులు ఈ రహదారి గుండా తరలివెళ్తారు. ఈ మేరకు భక్తులు, ప్రయాణికుల సౌకర్యార్థం ఈ నెల 16న కలెక్టర్ భవేష్ మిశ్రాతో పాటు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చలివాగు వంతెనను పరిశీలించి తాత్కాలిక రోడ్డు నిర్మాణానికి కలెక్టర్ నిధులను కేటాయించడంతో శనివారం నుంచి తాత్కాలిక రోడ్డు పనులు ప్రారంభించారు.

తగ్గనున్న దూరభారం..

టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగులో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణం పూర్తి అయితే టేకుమట్ల మండల కేంద్రం నుంచి జమ్మికుంట పట్టణానికి సుమారు 15 కిలో మీటర్ల దూరభారం తగ్గుతుంది. ప్రస్తుతం టేకుమట్ల నుంచి జమ్మికుంట పట్టణానికి చిట్యాల, మొగుళ్లపల్లి మీదుగా వెళ్లాల్సి వస్తుంది.

ఎమ్మెల్యే చొరవతోనే..



“ టేకుమట్ల–రాఘవరెడ్డిపేట చలివాగు వంతెన కూలిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్పందించి, కలెక్టర్ చొరవతో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించేలా కృషి చేశారు. వారం రోజుల్లో టేకుమట్ల నుంచి రాఘవరెడ్డిపేట మీదుగా అన్ని రకాల వాహనాలను వెళ్లేందుకు పనులు జరుగుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి కృషి చేసిన ఎమ్మెల్యే, కలెక్టర్‌కు కృతజ్ఞతలు.

\- సతీష్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు

నిత్యావసర సరుకుల పంపిణీ



బియ్యం అందజేస్తున్న కౌన్సిలర్ పూర్ణచారి

రేగొండ: మండలంలోని దమ్మన్నపేట గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన వలస కృష్ణ అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పరకాల మున్సిపాలిటీ 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జెంకి పూర్ణచారి పరామర్శించి, 50 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పుట్ట రవీందర్, దాసరి రవి, కోర్ర నరేష్ తదితరులు పాల్గొన్నారు.